
సాక్షి సిద్దిపేట

శనివారం। 19। ఆగస్టు। 2023



మృత్యువులోనూ వీడని స్నేహం

ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ఇద్దరు మిత్రులు మృతి చెందిన సంఘటన జహీరాబాద్ లో బీదర్ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. 8లో..



వైద్యుల నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

మహిళ మృతికి కారణమైన ఆసుపత్రి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. 8లో..

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు 3వ విడత ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 30 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

సరస్వతీమాత దివ్యదర్శనం



విశేషాలంకరణలో అమ్మవారు

వర్గల్(గజ్వేల్): శుభకరమైన శ్రావణమాసం వచ్చింది. దేవాలయాలలో విశేష పూజలు, వ్రతాలు, పండుగలతో ఆధ్యాత్మికత వెల్లివిరియనుంది. శ్రావణమాసంలో తొలిశుక్రవారం సందర్భంగా సుప్రసిద్ధ వర్గల్ విద్యాధరి క్షేత్రంలో సరస్వతీ అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన జరిపించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అక్కారంలో కంపోస్టు ఎరువుల తయారీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గజ్వేల్‌రూరల్: గ్రామాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో జరుగుతున్న వివిధ రకాల పనులను జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని అక్కారం, శ్రీగిరిపల్లి, బయ్యారం, ర్యాగట్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని డంపింగ్‌యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, వైకుంఠధామాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, తడి-పొడి చెత్త సేకరణతో ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. అదే విధంగా పంచాయతీల రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బాల్‌చంద్రం, చంద్రమోహన్‌రెడ్డి, శివలక్ష్మీపాండుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధర్మారంలో క్షుద్ర పూజల కలకలం

మద్దూరు(హుస్నాబాద్): మండంలోని ధర్మారంలో గురువారం రాత్రి క్షుద్ర పూజలు కలకలం రేపాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని కొత్తవాడలో కొందరి ఇళ్ల ఎదుట పసుపు, కుంకుమలతో కూడిన నిమ్మకాయలు, గాజులు ఉంచారు. తెల్లవారుజామున లేచిన ఆయా కుటుంబాలు ఇంటి ముంగిట పసుపు కుంకుమ చూసి భయాందోళనకు గురయ్యాయి. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేస్తున్నారని, వారిని గుర్తించి శిక్షించాలన్నారు. అదే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

హుస్నాబాద్ అభివృద్ధికి రూ.25కోట్లు



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుస్నాబాద్: మున్సిపల్ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేసింది. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం రూ.25కోట్లు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేశారన్నారు. ఈ నిధులతో 20 వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలతో ప్రధాన కూడళ్ల సుందరీకరణకు వెచ్చిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజని, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, టీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

మద్యం దుకాణాలు: 93
దరఖాస్తులు: 4,058



ఆఖరి రోజే **1,944** అప్లికేషన్లు

- దరఖాస్తుదారుల నుంచి డబుల్ స్పందన
- ఈ నెల 21న సిద్దిపేట విపంచిలో లక్కీ డ్రా
- తీగుల్ నర్సాపూర్ షాపునకు పోటీ తీవ్రం





దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు



కారులో దరఖాస్తుదారుల మంతనాలు

సిద్దిపేటకమాన్: మద్యం దుకాణాల నూతన లైసెన్సుల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 4వేలకు పైగా దరఖాస్తులు రావడంతో అబ్కారీ శాఖకు కాసుల పంట పండింది. జిల్లాలో మొత్తం 4,058 దరఖాస్తులు వచ్చాయి. దీంతో అబ్కారీ శాఖకు రూ. 81.16కోట్ల ఆదాయంచేకూరింది. జిల్లాలో మద్యం అమ్మకాలు ఎక్కువగా జరగడం, రానున్న రోజుల్లో ఎన్నికలు ఉండడంతో మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి ఆశావహులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు.

భారీ స్పందన

జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు ఈ నెల 4 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల 16వ తేదీ వరకు 1,081 దరఖాస్తులు రాగా, గురువారం 788, ఆఖరి రోజు శుక్రవారం ఒక్కరోజే 1,944 దరఖాస్తులు వచ్చాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ దరఖాస్తు దారుల నుంచి భారీగా స్పందన లభించింది. మొత్తం 4,058 దరఖాస్తులు అందడం.. రూ.81.16కోట్ల ఆదాయం సమకూరడంతో కాసుల వర్షం కురిసింది. 2021లో 1,755 దరఖాస్తులు రాగా రూ.35.10కోట్ల ఆదాయం రాగా ప్రస్తుతం రెట్టింపు ఆదాయం సమకూరింది. దీంతో ఎక్సైజ్ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆఖరి రోజు సిద్దిపేట ఎక్సైజ్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారులతో సందడి నెలకొంది. దరఖాస్తుదారులు వారి లక్కును పరీక్షించుకోవడానికి కొంత మంది తమ కుటుంబ సభ్యులు, పిల్లలను తీసుకుని తమ ఇష్టదైవం, కుల దేవతల ఆలయాలకు వెళ్లి పత్రాలకు పూజలు నిర్వహించి దరఖాస్తు చేసుకున్నారు. అదృష్టం ఎవరికి దక్కనుందో ఈ నెల 21న సిద్దిపేట విపంచి కళానిలయంలో నిర్వహించే లక్కీ డ్రా ద్వారా తెలియనుంది. తీగుల్ నర్సాపూర్ దుకాణానికి ఏకంగా 135కు పైగా దరఖాస్తులు వచ్చాయి. కొండపోచమ్మ ఆలయం సమీపంలో ఉండడంతో ఈ దుకాణాన్ని దక్కించుకోవడానికి ఆశావహులు భారీ ఎత్తున పోటీ పడుతున్నారు. సిద్దిపేట సర్కిల్‌లో 1,132, గజ్వేల్ సర్కిల్‌లో 1,196, హుస్నాబాద్ సర్కిల్‌లో 759, చేర్యాల సర్కిల్‌లో 613, మిరుదొడ్డి సర్కిల్‌లో 358 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు.

సమగ్రంగా సాగు లెక్క

జిల్లాలో వ్యవసాయ గణన

- మూడు దశల్లో నిర్వహించేందుకు ప్రణాళిక
- మొదటి దశలో 48 శాతం పూర్తి
- వివరాలు సేకరిస్తున్న ఏఈవో, గణాంక అధికారులు
- సాగు కమతాల వారీగా యాప్‌లో నమోదు
- వ్యవసాయ స్థితిగతులు తెలుసుకునేందుకు దోహదపడనున్న సర్వే



మర్కూక్‌లో వివరాలను సేకరిస్తున్న ఏఈవో నాగేందర్ రెడ్డి

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో వ్యవసాయ గణన కొనసాగుతోంది. సాగు కమతాల వారీగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. వ్యవసాయ అభివృద్ధి ప్రణాళిక, సామాజిక ఆర్థిక విధాన రూపకల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదేళ్లకు ఒక్కసారి గణన నిర్వహిస్తాయి. గతంలో 2015-2016లో ఈ గణన చేపట్టారు. 2021-2022లో చేయాల్సిండగా కరోనాతో వాయిదా పడింది. ఈనెల 9 నుంచి గణనను వ్యవసాయ శాఖ, గణాంకశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఏఈఓలు, మండల గణాంక అధికారులు కలిసి వివరాలను సేకరిస్తున్నారు. వీఆర్వో వ్యవస్థ రద్దు చేసిన నేపథ్యంలో మొదటి సారిగా ఏఈవోల ఆధ్వర్యంలో వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 48శాతం సర్వే నంబర్‌లలో వివరాలను సేకరించారు. ఈ నెల చివరి వరకు సేకరణ పూర్తి కానుంది.

మూడు దశల్లో..

జిల్లాలో 383 రెవెన్యూ గ్రామాలు 127 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. వ్యవసాయ గణనను మూడు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశ ప్రస్తుతం కొనసాగుతోంది. మొదటి దశ పూర్తయిన తర్వాత మూడు నెలలకు రెండో, మరో మూడు నెలలకు మూడో దశ నిర్వహించనున్నారు. ఆయా రెవెన్యూ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రైతులను కలుస్తున్నారు. క్షేత్రస్థాయిలో కమతాల వారీగా విస్తీర్ణం, భూమి వినియోగం, సాగులో ఉందా? యజమాని, సాగుదారు, కౌలుదారుల వివరాలు, ఏయే పంటలు పండిస్తున్నారు? నీటి వినియోగం, సాగు నీరు, ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, ఇతరుల అనే అంశాల పై వివరాలను సేకరిస్తున్నారు. రెవెన్యూ గ్రామంలోని భూమి సర్వే నంబర్లలోని స్లాట్ వారీగా యూనిట్‌గా తీసుకొని సర్వే చేస్తున్నారు. అగ్రి సెన్సెస్ పేరిట ప్రత్యేక మొబైల్ యాప్‌లో వెంటవెంటనే వివరాలను నమోదు చేస్తున్నారు.

48శాతం పూర్తి...

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సర్వే నంబర్ల వారీగా 48శాతం వివరాలను సేకరించారు. మొత్తం 383 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 10 గ్రామాల్లో పూర్తయింది. 314 గ్రామాల్లో కొనసాగుతుండగా 59గ్రామాలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 11,30,836 సర్వే నంబర్లుండగా 5,52,300 సర్వే నంబర్లలలో వ్యవసాయ గణన పూర్తికాగా ఇంకా 5,78,536 సర్వే నంబర్లలలో పెండింగ్‌లో ఉంది.

నెలాఖరులోగా పూర్తి చేస్తాం

జిల్లాలో వ్యవసాయ గణన కొనసాగుతోంది. ఈ నెల 8న కలెక్టర్ నేతృత్వంలో శిక్షణ ఇచ్చారు. ప్రత్యేక యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలి అని వివరించారు. ఈ నెల చివరిలోగా వంద శాతం పూర్తి చేస్తాం. ఇప్పటి వరకు 48శాతం పూర్తయింది.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి



సిద్దిపేట జోన్: కోమటిచెరువు సమీపంలోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

పాపన్న ఆదర్శనీయుడు

బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఊరూరా ఉన్న సర్వాయి పాపన్న విగ్రహాలకు వివిధ పార్టీల నాయకులు, పలు సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేసిన మహనీయుడని అన్నారు. అందరూ ఆయన ఆశయసాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

-సాక్షి నెట్ వర్క్

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సమాఖ్య 14వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రుణాలు తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. చిన్న చిన్న కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నారు. జిల్లాలోనే చిన్నకోడూరు మహిళా సంఘాలు అత్యధికంగా రుణాలు పొందారని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళలకు సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షులు పాపయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం మహిపాల్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మండల అధికారులు, ప్రజా ప్రతినిధులతో పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు కూరగాయల సాగు, ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

అభివృద్ధి పనులు వేగిరం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొన్నారు. శుక్రవారం ఆసరా పెన్షన్లు, హరితహారం, బీసీ-మైనార్టీలకు ఆర్థిక సహాయం, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి, నివాస స్థలాల అందజేత తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఎఫ్ఓ శ్రీనివాస్, డిఈఏఓ జగత్ కుమార్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాల్సిందే

గంగాపూర్‌లో రోడ్డెక్కిన దళితులు



గంగాపూర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న దళితులు

మర్కూక్(గజ్వేల్): దళితబంధు అందరికీ ఇవ్వాలంటూ దళితులు రోడ్డెక్కారు. శుక్రవారం మండలంలోని గంగాపూర్ దళితులు ప్రధాన రోడ్డుపై ధర్నాకు దిగారు. సుమారు గంటపాటు ధర్నా చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. బీజేపీ నాయకులు వారికి మద్దతు తెలిపి ధర్నాలో కూర్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు పూర్వారెడ్డి మాట్లాడుతూ దళితుల మధ్య ప్రభుత్వం చిచ్చుపెట్టిందని అన్నారు. అర్హులందరికీ దళిత బంధు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎస్ఐ శంకర్ ధర్నా వద్దకు చేరుకుని ఆందోళనను విరమించాలని సముదాయించారు. అయినా వారు విరమించకపోవడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐ జానకీరాంరెడ్డి జోక్యం చేసుకుని దళితులతో మాట్లాడారు. విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, రమేశ్, నర్సింహులు, రవి, రామచంద్రం, మహిళలు పాల్గొన్నారు.

ఈ భవనాలకు మోక్షమెప్పుడో?

- అట్టహాసంగా మంత్రి కేటీఆర్‌చే ప్రారంభం
- మూడు నెలలు గడుస్తున్నా వినియోగంలోకి రాని దైన్యం
- అలంకారప్రాయంగా పలు ప్రభుత్వ భవనాలు



పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్రూం ఇండ్లు

హుస్నాబాద్: మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అట్టహాసంగా ప్రభుత్వ భవనాలను ప్రారంభించారు. మూడు నెలలు గడుస్తున్నా వినియోగంలోకి రావడంలేదు. పనులు పూర్తి చేయకుండానే ప్రారంభించడంతో అలంకారప్రాయంగా మిగిలాయి. పట్టణంలో మే 5న మంత్రి పలు భవనాలకు ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హుస్నాబాద్ పట్టణంలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించారు. స్టేడియం నిర్వహణ బాధ్యత స్పోర్ట్స్ అథారిటీది. అయినా పట్టించుకోకపోవడంతో ఇండోర్ స్టేడియం వినియోగంలోకి రావడం లేదు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఇండోర్ స్టేడియం నిర్వహణను మున్సిపాలిటీకి అప్పగించాలని అధికారులను ఆదేశించారు. దీని నిర్వహణకు ఓ కమిటీ కూడా వేశారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు

హుస్నాబాద్ పట్టణంలో ఇల్లు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం రెండు విడతల్లో 560 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. జీ ప్లస్ పద్ధతిలో ఇళ్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 264 ఇళ్లు పూర్తయ్యాయి. మొత్తం 342 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ ఇళ్లకు లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. మంత్రి కేటీఆర్ ప్రారంభించి ఐదుగురికి మాత్రమే పట్టాలు ఇచ్చారు. పట్టాలు ఇచ్చినా వారికి ఇళ్లు కేటాయించలేదు. మిగిలిన లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వకపోవడంతో నిరాశతో ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం...

హుస్నాబాద్ పట్టణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. సౌకర్యాలు సరిగా లేక రేకుల షెడ్లలోనే తరగతులు కొనసాగుతున్నాయి. దీంతో కొత్త భవనం కోసం ప్రభుత్వం రూ.2.25కోట్ల వ్యయంతో కొత్త భవనాన్ని నిర్మించి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. దాదాపు 3 నెలలు గడుస్తున్నా కొత్త భవనంలోకి షిఫ్ట్ కాలేదు. కొత్త భవనంలో కరెంట్ సౌకర్యం, నీటి వసతి లేకపోవడంతో పాత భవనంలోనే నిర్వహణ కొనసాగుతుంది.

గిరిజన బాలికల వసతి గృహం...

ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహాన్ని రూ.కోటి వ్యయంతో ప్రభుత్వం నిర్మించింది. దాదాపు రెండేళ్ల తర్వాత కళాశాల భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అయినా గిరిజన కళాశాల వసతి గృహానికి ఎలాంటి రక్షణ లేదని, వసతి గృహం చుట్టు ప్రహ నిర్మించలేదు. ఈ వసతి గృహానికి రాత్రి సమయంలో రావాలంటే ఏలాంటి స్ట్రీట్ లైట్లు లేకపోవడంతో విద్యార్థినిలు ఆందోళన చెందుతున్నారు. అలాగే పట్టణంలో రూ.1.25 కోట్లు వెచ్చించి దుకాణ సముదాయాన్ని నిర్మించారు. రెండు అంతస్తుల్లో 18 గదులను నిర్మించి మంత్రి చే ప్రారంభించారు. చిన్న చిన్న పనుల పెండింగ్‌లో ఉండటంతో వినియోగంలోకి రావడం లేదు. ఈ దుకాణ సముదాయం వినియోగంలోకి వస్తే చిరు వ్యాపారులకు ఎంతో మేలు కలుగుతుంది.

త్వరలోనే వినియోగంలోకి తెస్తాం



పట్టణంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించిన భవనాలను త్వరలోనే వినియోగంలోకి తెస్తాం. డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇంటి పట్టాలు ఇవ్వనున్నారు. డిగ్రీ కళాశాలలో నీటి వసతి కోసం బోరు వేయాలని అధికారులను ఆదేశించాం. మున్సిపల్ దుకాణ సముదాయంలోని గదులకు టెండర్లు పిలవాలని పాలకవర్గం తీర్మానించింది. వారం రోజుల్లో టెండర్లను ఆహ్వానిస్తాం. అలాగే ఇండోర్ స్టేడియాన్ని రెండు రోజుల్లో క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తాం.

– ఆకుల రజిత, మున్సిపల్ చైర్ పర్సన్, హుస్నాబాద్

క్లుప్తంగా

'సాక్షి' ఫొటో జర్నలిస్టులకు రాష్ట్రస్థాయి అవార్డులు


కె.సతీష్


బి. శివ ప్రసాద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సంగారెడ్డి: ప్రపంచఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఫొటో జర్నలిస్టు అసోసియేషన్, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటోగ్రఫీ పోటీల్లో సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల 'సాక్షి' ఫొటో జర్నలిస్టులు కె.సతీష్, బి.శివప్రసాద్‌కు ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డులకు ఎంపికయ్యారు. ఆదివారం మంత్రి హరీశ్‌రావు నుంచి అవార్డు అందుకోనున్నారు.

బీర్ బాటిల్‌తో దాడి.. వ్యక్తికి తీవ్రగాయం

మెదక్ మున్సిపాలిటీ: ఫోన్ గట్టిగా మాట్లాడుతున్నాడని బీర్ బాటిల్‌తో దాడి చేసిన సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మెదక్‌లోని ఓ వైన్స్ వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా.. పట్టణంలోని ఓ వైన్స్ సిట్టింగ్ రూంలో బాబా కాలనీకి చెందిన జమీర్, మగ్దుంపూర్ చెందిన శెట్టి రాజు మద్యం తాగేందుకు వచ్చారు. ఫోన్ ఎందుకు గట్టిగా మాట్లాడుతున్నావని ప్రశ్నించిన జమీర్‌ను రాజు బీర్ బాటిల్‌తో పొడిచాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వ్యక్తిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. రాజు పోలీసులు అదుపులో తీసుకున్నారని తెలిసింది.

చోరీకి యత్నమా.. నిర్లక్ష్యమా?


డోర్ తెరిచి ఉన్న ఏటీఎం

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లి బస్టాండ్ సమీపంలో ఉన్న ఇండియా1 ఏటీఎం క్యాష్ పెట్టే బాక్స్‌డోర్ సగం తీసి ఉండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇది దొంగలు చేసిందా.. లేదా అధికారుల నిర్లక్ష్యమా అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. గురువారం రాత్రి ఏటీఎం నిర్వాహకులు క్యాష్ పెట్టి వెళ్లినట్లు అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్‌టీసీ అధికారులు చెబుతున్నారు. శుక్రవారం క్యాష్ కోసం వెళ్లిన వినియోగదారులు ఏటీఎం పనిచేయకపోవడం, బాక్స్‌కింద సరిగా డోర్ లాక్ చేయకుండా ఉండటం గమనించారు. అయితే ఈనెల 5వ తేదిన కూడా ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. మిషన్‌ను, విద్యుత్ సరఫరా వైర్లు, సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. దీనిపై నిర్వాహకులు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. వరుసగా ఇలాంటి సంఘటనలు జరగటంపై స్థానికులు వివిధ రకాలుగా చర్చించుకుంటున్నారు.

మహిళకు తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): టీవీఎస్‌పై వెళ్తున్న భార్యాభర్తలను ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని అంబాజిపేట గ్రామశివారులో చోటుచేసుకుంది. శుక్రవారం రామాంతాపూర్‌కు చెందిన దంపతులు గవ్వలపల్లి తండాలో కూరగాయాలు తీసుకుని టీవీఎస్‌పై రాంగ్ రూట్‌లో చేగుంటకు బయలుదేరారు. ఎదురుగా వచ్చిన ఆటో వారిని ఢీకొట్టడంతో రాణి తీవ్రంగా గాయపడింది. ఎడమ చేయి, కాలు విరగడంతో 108లో మెదక్ ఏరియా అస్పత్రికి తరలించారు. పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- ఆగిఉన్న లారీ ఢీకొన్న కారు
- ప్రమాదంలో ఇద్దరు మిత్రులు దుర్మరణం
- మృతుల్లో మాజీ మంత్రి తమ్ముడి కుమారుడు




ఆస్పత్రిలో మృతదేహాలు

జహీరాబాద్ టౌన్: ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ఇద్దరు మిత్రులు మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో బీదర్ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. జహీరాబాద్ టౌన్ సీఐ రాజు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం బీదర్ పట్టణానికి చెందిన మాజీ మంత్రి గురుపాదప్ప నాగమర్పళి తమ్ముడు చంద్రకాంత్ కుమారుడు అవిరాజ్ నాగమర్పళి(27), మన్నెక్కిలి చెందిన వీరుపాటిల్(30) ఇద్దరు స్నేహితులు. వీరు కాంట్రాక్ట్ పనులు చేస్తుంటారు. మన్నెక్కిలి నుంచి బీదర్‌కు వచ్చిన వీరు పాటిల్‌ను జహీరాబాద్‌లో డ్రాప్ చేసి హైదరాబాద్‌లో ఉంటున్న భార్య వద్దకు వెళ్లేందుకు అవిరాజ్ నాగమర్పళి ఇన్నోవా కారులో బయల్దేరాడు. బీదర్ నుంచి వస్తున్న వీరు జహీరాబాద్ సమీపంలో రైల్వే గేటు దర్గా వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారు. ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి జహీరాబాద్ డీఎస్పీ రఘు, సీఐ రాజు సందర్శించారు. మృతదేహాలను జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ రోడ్డుపై నిలపడ వల్ల ఈ ప్రమాదం జరిగిందని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. అవిరాజ్ నాగమర్పళికి భార్య, ఏడాది పాప ఉంది.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య

- మద్యంకు బానిసై

హవేళీఘనపూర్(మెదక్): మద్యంకు బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడిన సంఘటన మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన చెవ్వ సాయిలు(35) చేపలు పడుతూ జీవనం సాగిస్తుండేవాడు. తాగుడుకు అలవాటు పడిన ఆయన గురువారం రాత్రి ఇంట్లో గొడవపడ్డాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఫ్యానుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతునికి భార్య విజయ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

అప్పుల బాధతో..

గజ్వేల్‌రూరల్: అప్పుల బాధతో మండల పరిధిలోని జాలిగామ గ్రామానికి చెందిన ఎల్కంటి యాదగిరి(44) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఉన్న ఎకరం భూమిని సాగుచేసుకుంటూ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కుటుంబ పోషణకు సుమారు రూ.3లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చాలని వేధింపులు రావడంతో మనోవేదనకు గురయ్యాడు. శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

తూప్రాన్: మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన పట్ట ఎల్లం(45) ఆర్థికంగా కొంత కాలంగా ఇబ్బంది పడుతున్నాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ఆయన గ్రామ సమీపంలోని చెరువుతో దూకాడు. గమనించిన కుటుంబ సభ్యులు బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

ఐదుగురు అదృశ్యం

ఆరునెలల చిన్నారి..

సంగారెడ్డి అర్బన్: నిద్రిస్తుండగా పక్కలో ఉన్న చిన్నారి అదృశ్యమైన ఘటన గంజి మైదానంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ శ్రీధర్ రెడ్డి కథనం ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన భార్యాభర్తలు వోల్లెపు రాజు, యేసుమణి. వీరికి ఇద్దరు కుమార్తెలు గీతా, 6నెలల చిన్నారి రూప ఉన్నారు. వారానికోసారి వ్యక్తిగత చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తుంటారు. గురువారం కూడా వచ్చి చీకటి పడటంతో గంజి మైదానంలో నిద్రించారు. తెల్లవారుజామున లేచి చూస్తే రూప కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు తెలిస్తే 8712656718 నెంబర్‌లో తెలపాలన్నారు.

మహిళ..

జిన్నారం(పటాన్‌చెరు): మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాకేష్, దుర్గా అన్నారంలో నివాసముంటున్నారు. అతను ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈనెల 13న కూలీ పనులకు వెళ్లి దుర్గా తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఫలితం లేకపోయింది. భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థిని..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ నగర్ కాలనీకి చెందిన ఎం.ఫెబ్ ఇంటర్ చదువుతోంది. ఈనెల 17న సాయంత్రం కుటుంబ సభ్యులకు బయటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు.. బంధువులు, స్నేహితులను వాకబు చేయగా ఆచూకీ లభించలేదు.

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో..

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన మల్లేష్ (45) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. భార్య సునీత తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన మల్లేష్ (45) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య సునీత తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.

విద్యార్థిని అదృశ్యం

సిద్దిపేటఅర్బన్: విద్యార్థిని అదృశ్యంపై సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని మిట్టపల్లి గురుకుల కళాశాలలో ఇటీవల ఇంటర్ ఫస్టియర్‌లో చేరింది. ఈ నెల 11న బంధువులు చనిపోవడంతో స్వగ్రామానికి వెళ్లింది. 14వ తేదీన తల్లి కూతురును కళాశాలలో వదిలి వెళ్లింది. 16వ తేదీన నుంచి కనిపించకుండా పోయింది. 17వ తేదీన తల్లి కళాశాలకు వచ్చి ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. వెంటనే సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కూతురు కనిపించడంలేదని ఫిర్యాదు చేసింది.

వైద్యుల నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

- ఆసుపత్రి ఎదుట కుటుంబీకులు, అఖిలపక్షం ధర్నా


పద్మజ ఆసుపత్రి ఎదుట ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ షేక్‌లాల్ మధార్

నర్సాపూర్ : మహిళ మృతికి కారణమైన పద్మజ ఆసుపత్రి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కుటుంబీకులతో కలిసి అఖిల పక్ష నాయకులు ధర్నా చేపట్టారు. నర్సాపూర్‌లోని చైతన్యపురి కాలనీకి చెందిన ఇందిర(43) గురువారం పద్మజ ఆసుపత్రిలో గర్భసంచి తొలగించే ఆపరేషన్ కోసం చేరిన విషయం తెలిసిందే. వైద్యులు నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేయడంతోనే ఆమె మృతిచెందిందని ఆరోపిస్తూ శవాన్ని ఇంటికి తీసుకెళ్లలేదు. శుక్రవారం కుటుంబీకులు, బంధువులతో కలిసి అఖిల పక్ష నాయకులు బాల్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, సురేష్, మల్లేష్‌గౌడ్, శేఖర్, రఘు వీరారెడ్డి, రమణరావు, శ్రీనివాస్‌గుప్తా, అశోక్, నర్సింలు ఆసుపత్రి వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ షేక్‌లాల్ మదార్, ఎస్ఐ శివకుమార్ ఆందోళనకారులతో మాట్లాడటానికి ప్రయత్నించగా.. వైద్యులపై చర్యలు తీసుకుని మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని భీష్మించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఆసుపత్రిపై చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆసుపత్రి ఎండీ డాక్టర్ సిద్దార్థ, ఆపరేషన్ చేసిన డాక్టర్ స్వామి తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ఆసుపత్రి సీజ్

పద్మజ ప్రైవేటు ఆసుపత్రిలో మహిళ చనిపోవడంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా, డిఎంహెచ్ఓ డాక్టర్ చందునాయక్‌ల ఆదేశాల మేరకు ఆసుపత్రిని శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయనిర్మల, మండల ఆర్ఐ ఫైజల్‌తో కలిసి సీజ్ చేశారు.

అపరిచితులతో పరిచయాలు వద్దు

- అడిషల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్‌రావు


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

సిద్దిపేటరూరల్: సోషల్ మీడియాలో గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయాలు చేసుకోవద్దని అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాస్‌రావు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాఘవాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. చదువుకునే వయస్సులో చెడు అలవాట్లకు బానిస కావొద్దని సూచించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే షీటీమ్‌కు సమాచారం అందించాలన్నారు. మహిళల రక్షణ కోసం షీటీమ్స్, భరోసా సెంటర్ పని చేస్తున్నాయని తెలిపారు. ఇబ్బందుల్లో ఉన్నప్పుడు డయల్ 100, షీటీమ్ వాట్సాప్ నెంబర్ 8712667343, మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ చేరాలు, ఎస్ఐ కిరణ్ రెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అధ్యాపకులు, షీటీమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో పరిధిలోని బస్సులలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో రాకపోకలు సాగించే ప్రయాణికుల సమస్యల పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను శనివారం ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు జరిగే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో 9959226270 నంబరులో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. జీపీపీ డిపో పరిధిలోని ఆర్టీసీ బస్సులలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుబ్బాకరూరల్: పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎండీ.ఇలియాస్(40) ట్రాన్స్‌కో విభాగంలో బొప్పాపూర్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. నరాల బలహీనతతో బాధపడుతూ ఒకరి తర్వాత ఒకరు ఇద్దరు కుమారులు మృతి చెందారు. కుమారుల వైద్య ఖర్చుల కోసం అప్పులు చేశాడు. మరోవైపు కుమారులు మృతిచెందడంతో తట్టుకోలేకపోయాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. గత నెల 23న పురుగు మందు సేవించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఇలియాస్‌ను తిమ్మాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ హామీలు నెరవేర్చాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్


సిద్దిపేట బస్టాండ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ చౌరస్తాలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపైన బైఠాయించిన ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పేద ప్రజలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, పెన్షన్‌లు, నూతన రేషన్ కార్డులు, దళిత, బీసీబంధు పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉపేందర్‌రావు, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశం, అరుణరెడ్డి, యాదగిరి, కృష్ణ, సునీల్, సుగుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రేపు గజ్వేల్‌లో గద్దర్ సంస్మరణ సభ

గజ్వేల్: పాటకు ప్రాణం పోసి ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణ సభను ఈనెల 20న నిర్వహించనున్నట్లు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11గంటలకు గద్దర్ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రజా, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, కర్షక సంఘాల నాయకులు, ప్రగతిశీల శక్తులంతా కలిసి గద్దర్ ఆశయాలను గుర్తు చేసుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు మైస రాములు, తుమ్మ శ్రీనివాస్, దాసరి ఏగొండస్వామి, చిప్పల యాదగిరి, దేవేందర్, మహేందర్, నర్సింలు, నీరుడి స్వామి, కృపానందం, కాసమొల్ల శ్రీను, వేణు, సురేష్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

సిద్దిపేటరూరల్: తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్స్ నాన్ టీచింగ్ సిబ్బందికి జీఓ 60 ప్రకారం వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ హాస్టల్ నాన్ టీచింగ్ సిబ్బంది డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ పదేళ్ల నుంచి పనిచేస్తున్న హాస్టల్ ఎంప్లాయిస్ వర్కర్స్‌కు అతి తక్కువ వేతనాలు ఇవ్వడం సరికాదన్నారు. వీరిని 2018లో సర్వశిక్ష అభియాన్‌లో విలీనం చేశారని, మోడల్ స్కూల్లో జీవో 60 అమలు చేస్తున్న విధంగా హాస్టల్లో అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటల పని విధానం రద్దు చేసి 8గంటల డ్యూటీ చార్ట్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి కొమురయ్య, మోడల్ స్కూల్, హాస్టల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ బి.స్వాతి, పి.రేణుక, తనుజ, సుజాత, బాల, కాశీనాథ్, శారద, మంజుల శ్యామల పాల్గొన్నారు.

వరి యాజమాన్య పద్ధతులపై శిక్షణ


మాట్లాడుతున్న హెడ్ శాస్త్రవేత్త శ్రీదేవి

సిద్దిపేటరూరల్: వరి సాగులో ఎదురయ్యే సమస్యలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు తోర్నాల పరిశోధన స్థానం హెడ్ శాస్త్రవేత్త శ్రీదేవి అన్నారు. శుక్రవారం వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం, తోర్నాల ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన ఇబ్రహీంపూర్ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. వరికి వచ్చే కాండం తొలుచు పురుగు (మొగి పురుగు) నివారణకు దీపపు ఎర లేదా సోలార్ దీపపు ఎర లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగుపై నిఘా పెట్టాలని తెలిపారు. వయ్యారి భామ పుప్పొడి వలన మనుషులకు, పశువులకు దగ్గు దమ్ము వస్తుందని, ఒంటిపై దద్దుర్లు ఏర్పడతాయన్నారు. అదేవిధంగా విష జ్వరాలు వ్యాపింపజేస్తాయని, పంటపొలాల్లో మొక్క కనిపించగానే వేర్లతో సహా తీసివేసి గుంటలో కప్పి వేయాలన్నారు. నాలుగైదు మాసాల తర్వాత దీనిని సేంద్రియ ఎరువుగా వాడుకోవచ్చన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు విజయ్, డా.ఉమారాణి, సరిత, సాయినాథ్, డా. శ్వేత, డా.పల్లవి, పొలాలు పరిశీలించి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రమణి, వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున, సర్పంచ్, రైతుబంధు సమితి అధికారి నగేష్, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లడుతూ భవన నిర్మాణాలు, ప్రాజెక్టులు, కాలువలు, రోడ్లు తదితర రంగాల్లో వేలాది మంది కార్మికులు పనులు చేస్తున్నారని గుర్తు చేశారు. నిర్మాణ రంగాల నుంచి సెస్ రూపంలో డబ్బులు ప్రభుత్వానికి జమవుతున్నా కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇటీవల ప్రమాదాలు, సహజ మరణాలతో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు నష్ట పరిహారం అందలేదని, కార్మిక శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేయడంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అమలు చేయాలని, 55 ఏళ్లు నిండిన కార్మికులకు రూ. 5 వేల పెన్షన్ ఇవ్వాలని, వారి పిల్లలకు స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పించాలని, వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తూ రూ.2లక్షల ప్రోత్సాహకాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటాచారి, స్వామి, రాజయ్య, కనకరాజు, కమలాకర్, ఆంజనేయులు, మల్లయ్య పాల్గొన్నారు.

అస్తిత్వం కోల్పోతున్న చేర్యాల

- వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి
- అఖిలపక్ష జేఏసీ డిమాండ్


మాట్లాడుతున్న అఖిలపక్షం జేఏసీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): చారిత్రకంగా, రాజకీయంగా అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని అఖిలపక్షం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షం జేఏసీ ఆధ్వర్యంలో చేర్యాలలోని గాంధీ సెంటర్ వద్ద శుక్రవారం రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకప్పుడు తాలూకాగా, నియోజకవర్గ కేంద్రంగా వెలుగు వెలిగిన చేర్యాల రోజురోజుకు అస్తిత్వాన్ని కోల్పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాన్ని ముక్కలు చేసి అసెంబ్లీ జనగామ, ఎంపీ భువనగిరి, వ్యవసాయ డివిజన్ గజ్వేల్, ఏసీపీ, విద్యుత్ హుస్నాబాద్, జిల్లా సిద్దిపేటలకు విడదీసి చేర్యాల ప్రాంతాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని ఐదేళ్ల నుంచి జేఏసీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో అనేక ధర్నాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి, వినతి పత్రాలు ఇచ్చామన్నారు. 56 గ్రామపంచాయతీలు తీర్మానం చేసి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మంత్రి హరీశ్‌రావులకు అందజేసినప్పటికీ కనీసం స్పందించకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరారు.

వైభవంగా శ్రావణ పూజలు




పూజలు చేస్తున్న భక్తురాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రావణమాసం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అన్ని ఆలయాలలో భక్తులు శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా వైష్ణవ, శైవ ఆలయాలలో భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. ఇందులో భాగంగా శ్రీ సంతోషిమాత ఆలయంలో గోవు ప్రవేశం చేయించారు. తిరుమల తిరుపతి దేవస్థాన బోర్డు మాజీ మెంబర్ మొరంశెట్టి రాములు ఆలయానికి లేగదూడను అప్పగించారు. అనంతరం గోవుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సంతోషిమాత అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కుంకుమార్చన, పుష్పార్చన, తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించారు.